దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంపల్లిరూరల్, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా లగేజీ బ్యాగుల్లో విలువైన వస్తువులను పెట్టుకొని షాపింగ్ చేయవద్దని బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ ప్రజలకు సూచించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో లగేజీ బ్యాగుల్లో విలువైన వస్తువులను దొంగిలించే అవకాశాలుంటాయని తెలిపారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగలు పడే ప్రమాదం ఉందన్నారు. విలువైన వస్తువులు, డబ్బులు పెట్టి వెళ్లవద్దన్నారు. ఊరికి వెళ్తే పోలీసులకు సమాచారం అందించి వెళ్లాలని, ఆ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జనసంచారం అధికంగా ఉండే మార్కెట్ ఏరియా, బజార్ ఏరియాలలో చైన్ స్నాచింగ్, బ్యాగ్ లిఫ్టింగ్‌లకు పాల్పడే అవకాశాలున్నందున షాపింగ్ లకు వచ్చే మహిళలు వీలైనంతవరకు తమ నగలను బయటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ బన్సీలాల్ కోరారు.

టీఎన్జీవో స్టేట్ సెక్రటరీకి ఉద్యోగుల అభినందనలు

మారం జగదీశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

లక్షెట్టిపేట, జనవరి 13: టీఎన్జీవో స్టేట్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన మారం జగదీశ్వర్‌ను ఆ సంఘం ఉద్యోగులు హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం కలిశారు. పదవి పొందిన తర్వాత మొదటి సారి కావడంతో సంఘం ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంఏ కలేజ్‌అంజుం, జిల్లా కార్యదర్శి తిరుపతి, కోశాధికారి సత్తయ్య, ఈసీ మెంబర్ గంగమల్లు తదితరులు ఉన్నారు.

మార్కెట్లో సంక్రాంతి సందడి

- రంగులు, పతంగులు, పండుగ సామగ్రి దుకాణాల వద్ద రద్దీ

ముగ్గుల కోసం రంగులు కొంటున్న మహిళలు

బెల్లంపల్లి, జనవరి 13: బెల్లంపల్లి మార్కెట్, బజార్ ఏరియాలో సంక్రాంత్రి సందడి నెలకొన్నది. నోముల సామగ్రి, పతంగులు, దారం, చరఖాలు, వివిధ రకాల పూలు, రేగుపండ్లను, ముగ్గులకు కావాల్సిన రంగుల కోసం వచ్చిన వారితో మార్కెట్ సందడిగా మారింది. నోములకు వినియోగించే చక్కెర చిలుకలు, దారాలు, స్వీట్లు, ఇతర పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. సంక్రాంత్రి సందర్భంగా వివిధ రకాల రంగుల అమ్మకాలు ఊపందుకున్నాయి. రంగులను కొనుగోలు చేసి ఇంటి మందు ముగ్గులు వేసేందుకు మహిళలు పోటీ పడి ముస్తాబు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు పతంగులను ఎగురవేయడానికి వివిధ రకాల పతంగులను కొనుగోలు చేశారు. బస్తీలో చిన్నారుల నుంచి మొదలు పెద్దల వరకు పతంగు

పతంగుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

పిండి వంటలతో మహిళలు బిజీ..బిజీ

వేమనపల్లి, జనవరి 13 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు ఇండ్లలో పిండి వంటలు చేస్తూ బిజీగా గడుపుతున్నారు. సంక్రాంతి పండుగకు చకినాలు, గారెలు, కార పూసలు, బూరెలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో ఇండ్లలో మహిళలు పిండి వంటలు చేస్తూ గడుపుతున్నారు. సంక్రాంతి సెలవులు ఉండడంతో ఇతర పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు మండలానికి చేరుకున్నారు. పిండి వంటలు తయారు చేసే పిండి కోసం గిర్నీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. శనివారం ఏ ఇల్లు చూసినా మహిళలు పిండి వంటలు చేస్తూ కనిపించారు. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొన్నది.

కోడి పందేలపై నజర్

- పందేల నియంత్రణపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులపై నిఘా

కోటపల్లి, జనవరి 13 : పందెం కోళ్లపై పోలీస్‌లు ప్రత్యేక దృష్టి పెట్టారు. సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో కోడి పందేలు నడిచే అవకాశం ఉండగా, పందేల నియంత్రణ కోసం పోలీసులు ముందుగానే రంగంలోకి దిగారు. తెలంగాణ రాష్ట్రంలో కోడి పందెలపై పోలీసులు కఠినంగా ఉండడంతో పందెం రాయుళ్లు మహారాష్ట్రకు పయనమవుతున్నారు. ఈ ప్రాంతాల్లో దీపావళి, సంక్రాంతి పండుగలకు కోడి పందేలు ఆడుతున్నారు. చాలా మంది పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకొని కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారు. మహారాష్ట్రకు సరిహద్దు సమీపంలో కోటపల్లి, నీల్వాయి పోలీస్ స్టేషన్ల పోలీసులు ప్రతి యేటా ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. పందెం స్థావరాలను పసిగట్టి ఆకస్మిక దాడులు చేసి పందెం రాయుళ్లను అరెస్ట్ చేయడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే ముందస్తు హెచ్చరికలను జారీ చేశారు.

సీతారాంపల్లిలో యువకుల రక్తదానం

రక్తదానం చేస్తున్న సీతారాంపల్లి గ్రామ యువకులు

సీసీసీ నస్పూర్, జనవరి 13: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నస్పూర్ మున్సిపాలిటీలోకి సీతారాంపల్లి గ్రామానికి చెందిన టీమ్ యునిటీ యువత ఆధ్వర్యంలో యువకులు రక్తదానం దాదాపు 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుర్మిళ్ల వేణు, సహకార సంఘం డైరెక్టర్ ధర్ని మధు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పడాల రవీందర్, గ్రామపెద్దలు పొనగంటి రంగారావు, దెబ్బటి రామన్న, టీం యునిటీ సభ్యులున్నారు.

డ్వాక్రా భవనాన్ని నిర్మిస్తాం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల పేంసాగర్ రావు

భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

మంచిర్యాల అర్బన్, జనవరి 13 : డ్వాక్రా గ్రూపు మహిళా సంఘాలకు భవనం నిర్మిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల పేంసాగర్ రావు అన్నారు. పట్టణంలోని పోచమ్మ చెరువు కట్టపైన భవన నిర్మాణానికి స్థలాన్ని శనివారం మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేంసాగర్ రావు పరిశీలించారు. పోచమ్మ చెరువు కట్టపైన నడిచే వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు సైతం విశ్రాంతి కోసం భవన నిర్మాణానికి అనుకూలమైన స్థలం కోసం కట్ట మీద నాయకులు, అధికారులు కలిసి తిరిగారు. త్వరలోనే రెండు భవనాలను అందరికీ అనువుగా ఉండే స్థలంలోనే నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటా

మంచిర్యాలటౌన్, జనవరి 13: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటానని, కార్మికులు మాత్రం బాగా పనిచేసి పట్టణాలకు మంచిపేరు తీసుకురావాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి ముందు అందిచే సబ్బులు, నూనెలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కార్మికులు జీతాలు, ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పారిశుధ్య కార్మికురాలికి సన్మానం

పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్, జనవరి 13: స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా సఫాయి కర్మాయి విభాగంలో మంచిర్యాల మున్సిపాలిటీ నుంచి అవార్డుకు ఎంపికైన పారిశుధ్య కార్మికురాలు కొలిపాక సుజాతను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సన్మానించారు. ఢిల్లీ వెళ్లేందుకు తనవంతు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఆమెకు అవార్డును అందించనుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాథోడ్, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్పర్సన్ వసుంధర, కౌన్సిలర్లు ఉప్పలయ్య, మజీద్, సంజీవ్, మహేశ్, మహేశ్వరి, శ్రీలత, పద్మ, మాదంశెట్టి సత్యనారాయణ, భానేశ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముని తలంబ్రాల పంపిణీ

లక్షెట్టిపేట : తలంబ్రాలు పంపిణీ చేస్తున్న భక్తులు

లక్షెట్టిపేట, జనవరి 13: అయోధ్య రామ మందిరం ప్రాంరభోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో హనుమాన్ భక్తులు ఇంటింటికీ తిరుగుతూ శ్రీరాముని తలంబ్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు బోడ సతీశ్ రెడ్డి, రాజగోపాల్‌రావు, బైరి రామన్న, రాచకొండ శ్రీనివాస్, నడిమెట్ల రాజన్న, కండె శ్రీధర్, నరేశ్ చంద్, సత్యం, కొత్త సురేశ్, వడ్డెపల్లి సత్యనారాయణ, వొజ్జల సురేశ్, రావుల రాజమౌళి, తరుణ్, సరోజ, లత, రేఖ, జ్యోతి, నిషా, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, జనవరి13: మండలంలోని కొండాపూర్ ఆంజనేయస్వామి ఆలయానికి రాములవారి అక్షింతలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి శోభాయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికీ అక్షింతలతో పాటు రామ మందిర చిత్రపటాన్ని అందజేశారు.

దండేపల్లి :కొండాపూర్‌లో శ్రీరామ మందిర అక్షింతలతో భక్తులు

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

కాసిపేట, జనవరి 13 : మండలంలోని దేవాపూర్ క్రీడా ప్రాంగణంలో రొడ్డ చిన్న రమేశ్ స్మారక మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముందుగా రొడ్డ చిన్న రమేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని టోర్నీని ప్రారంభించారు. మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మడావి అనంతరావు, సర్పంచ్ ఆడె జంగు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, కొమ్ముల బాపు, భీంరావు, బద్ధి శ్రీనివాస్, రొడ్డ కిష్టయ్య, సిడం రాందాస్, రొడ్డ కారాజం, గడ్డం భీమయ్య, కలవేణి శ్రావణ్ పాల్గొన్నారు.

పల్లవి హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్సలు

- డాక్టర్ బీ రాజు



చికిత్సపొందుతున్న రోగులతో పల్లవి దవాఖాన బృందం

మంచిర్యాల ఏసీసీ, జనవరి 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలో పల్లవి హాస్పిటల్‌లో దీర్ఘకాలికంగా వంకర కాళ్లతో బాధపడుతున్న, ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైకాలు తీసేస్తే గానీ వారి ప్రాణాలు నిలవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఇలిజారోవ్ ఫిక్సేషన్ పద్ధతిని అనుసరించి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఆర్థో వైద్యుడు బీ రాజు అన్నారు. శనివారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఉత్తర తెలంగాణలోనే ఇలిజారోవ్ ఫిక్సేషన్ పద్ధతిని అనుసరించి లింబ్ సేవింగ్ సర్జరీలను చేస్తున్న ఏకైక దవాఖాన తమ దవాఖననేనని, ఈ పద్ధతిని అనుసరించి లింబ్ లెంతనింగ్ (ఎముకల పొడవు పెంచడం), డిఫార్మిటీ కరెక్షన్ (వంకర కాళ్లను సరిచేయడం), ఇన్‌ఫెక్షన్ నాన్ యూనియన్ (ఇన్ఫెక్షన్‌తో సరిగ్గా అతుక్కోని ఎముకలను అతుక్కునేలా చేయడం) లాంటి అత్యంత. క్లిష్టమైన సర్జరీలను నిర్వహించి ఎముకల సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. ఈ నెల రోజుల వ్యవధిలో ఇలిజారోవ్ ఫిక్సేషన్ ద్వారా కన్నెపల్లి మండలానికి చెందిన దుర్గమ్మ(75), బొక్కలగుట్ట ప్రాంతానికి చెందిన తిరుపతి(45), సీసీసీ, నస్పూర్‌కు చెందిన అంజమ్మ(60), కుమ్రంభీం ఆసీఫాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన లక్ష్మీనారాయణ(40)కు ఆపరేషన్లు చేసి వారి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. పెద్ద నగరాల్లో ఖర్చుతో అయ్యే అరుదైన ఆపరేషన్లు, తక్కువ ఖర్చులకే విజయవంతంగా శస్త్రచికిత్స చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పిల్లల వైద్య నిపుణురాలు సాయి శృజ మాట్లాడుతూ పుట్టుకతో వంకరకాళ్లతో ఉన్న పిల్లలకు, ఎదిగే దశలో ఎముకలు వంకరగా మారిన పిల్లల కాళ్లను ఇలిజారోవ్ ఫిక్సేషన్ ద్వారా సరిచేయవచ్చని చెప్పారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

అన్నదానం ప్రారంభిస్తున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్

బెల్లంపల్లి, జనవరి 13: నిరుపేదల ఆకలి తీర్చడం అభినందనీయమని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. శనివారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి వారం అన్నదానం ఏర్పాటు చేస్తున్న జనహిత సేవాసమితి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత మురుకూరి బాలాజీ, సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్‌కుమార్, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, ఉపాధ్యక్షురాలు హన్మాండ్ల రమాదేవి, సభ్యులు నగేశ్, గురుస్వామి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

మంచిర్యాల ఏసీసీ, జనవరి 13 : లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. 365 రోజులు ఉచిత నిత్యాన్నదానంలో భాగంగా సీనియర్ లైన్ మెంబర్ హనుమంతరావు మనవడు విహాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం చైర్ పర్సన్ హనుమంతరావు, సీనియర్ లైన్ మెంబర్స్ వీ మధుసూదన్ రెడ్డి, వినయ్ కుమార్, తిరుపతిరెడ్డి, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో పాటు చదువులోనూ ముందుండాలి

- హాజీపూర్ ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత
- ఉత్సాహంగా సైకిల్ రేస్ పోటీలు

విజేతలతోఎంపీపీ స్వర్ణలత, ప్రజా ప్రతినిధులు

హాజీపూర్, జనవరి 13 : విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని హాజీపూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మందపెల్లి స్వర్ణలత అన్నారు. శనివారం మండలంలోని బుగ్గట్టు వద్ద సంక్రాతి పండుగను పురస్కరించుకొని దాతల సహకారంతో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్వంలో ఏర్పాటు చేసిన సైకిల్ రేసింగ్ పోటీలకు హాజరై రైతు బంధు సమితి మండల కో–కన్వీనర్ పుస్కూరి శ్రీనివాస్ రావు, జడ్పీటీసీ ఒడ్డె బాలరాజు, కందుల రమేశ్, ఎస్ఐ నరేశ్ కుమార్‌తో కలిసి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం దాతలు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు సెల్‌ఫోన్‌లో లీనమైపోతున్న నేపథ్యంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్వంలో ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో పోటీ తత్వాన్ని అలవాటు చేసుకొని ముందుకు సాగాలన్నారు. పోటీల్లో మొదటి బహుమతి పొందిన వారికి రెండు వేల నగదు పురస్కారం, ద్వితీయ బహుమతి పొందిన వారికి వెయ్యి రూపాయల నగదుతో పాటు మెడల్స్‌ను అందజేశారు. సైకిల్ పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలకు సహకరించిన దాతలకు, పోటీలో పాల్గొన్న విద్యార్థులకు, పీఈటీలకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ పోటీల్లో 150 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, బేర పోచయ్య, అత్తె శ్రీనివాస్, తోట రవి, బొలిశెట్టి తిరుపతి, దేవి పోచయ్య, పాటు ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భారత్ వికసిత్ సంకల్పయాత్ర

పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

కోటపల్లి, జనవరి 13 : కోటపల్లి మండలకేంద్రంలో శనివారం భారత్ వికసిత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

దండేపల్లిలో..

వీడియోను తిలకిస్తున్న గ్రామస్తులు

దండేపల్లి, జనవరి 13: దండేపల్లి మండలంలోని మేదరిపేట గ్రామంలో శనివారం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, దీన్ దయాల్, అంత్యోదయ యోజన, అవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్, జీవన్ జ్యోతి పథకాలపై స్క్రీన్ ఏర్పాటు చేసి వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నోడల్ అధికారి శ్రీనివాస్, జీపీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, నాయకులు జాడి బాల్‌రెడ్డి, మల్లేశ్, వెంకటేశ్, కిషన్, లక్ష్మి, ఆశ కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

పద్మశాలీ సంఘం నేతలకు నివాళులు

దండేపల్లి, జనవరి 13: తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు, వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ ఇద్దరు ఇటీవల మృతిచెందగా మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో శనివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలీ సంఘానికి వారి మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘ మండల అధ్యక్షుడు వడ్డెపల్లి దేవయ్య, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శంకర్, సంఘ నాయకులు రామస్వామి, తిరుపతి, శ్రీనివాస్, మురళి, రమేశ్, లింగన్న, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

కోటపల్లి, జనవరి 13 : కోటపల్లి యూత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి కోటపల్లి మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 14వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు అందజేయనున్నట్లు వివరించారు. పోటీలో పాల్గొనే వారు ఈ నెల 14వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాల కోసం సెల్ నంబర్ 7995572104, 6304107997, 7569270371 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కబడ్డీ టోర్నమెంట్

కోటపల్లి మండలం పారుపల్లిలో ఈ నెల 15 నుంచి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 14వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాల కోసం సెల్ నెంబర్ 9948629677, 9985719507, 7799375512, 7995811464 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కోటపల్లి, చెన్నూర్, వేమనపల్లి మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు.

రాతి ధ్వజస్తంభ దాతకు సన్మానం

బెల్లంపల్లిరూరల్, జనవరి 13: బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.2 లక్షల విలువైన రాతి ధ్వజస్తంభాన్ని విరాళంగా అందించిన కాసిపేటకు చెందిన దాత సుంకరి రాజేశం, రాజేశ్వరి దంపతులకు శనివారం ఆలయ చైర్మన్ మాసాడి శ్రీదేవీశ్రీరాములు ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జిల్లపల్లి వెంకటస్వామి, రాజన్న, బామండ్లపల్లి గోపి, లక్ష్మీనారాయణ గౌడ్,అర్చకులు వేణుగోపాల్, సతీశ్‌శర్మ పాల్గొన్నారు.

మందుల పంపిణీ

జన్నారం, జనవరి 13 : మండలంలోని కిష్టాపూర్, లింగయ్యపల్లె గ్రామాలకు చెందిన 18 మంది యాదవ సంఘం సభ్యులకు గతంలో కేసీఆర్ సర్కారు పంపిణీ చేసిన గొర్రెలకు శనివారం పానకల్ పశు వైద్యశాలలో రాష్ట్ర ప్రభుత్వ మంజూరు చేసిన ఉచిత మందులను డాక్టర్ శ్రీకాంత్ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల తిరుపతి యాదవ్, పీ నరేశ్‌యాదవ్, కిష్టాపూర్ సొసైటీ అధ్యక్షుడు గట్టు మహేశ్‌యాదవ్ సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనుల్లో నాణ్యత పాటించాలి

కన్నెపల్లి, జనవరి 13 : కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల పనులను సర్పంచ్ భర్త రాజయ్య నాసిరకంగా చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శనివారం మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణానికి ఉపయోగించే రాడు, సిమెంటు సరైనది వాడడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, వెంకటేశ్, పోలోజీ మండి, వెంకటేశ్ తదితరులున్నారు.

సింగరేణి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, జనవరి 13: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ పోరాడుతుందని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1గనిపై భరోసా యాత్ర నిర్వహించారు. గనిపై కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులపై అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు. గనిలో రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యామ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గిరిగె స్వామి, నాయకులు ఎంబడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సస్పెన్షన్

బెల్లంపల్లి, జనవరి 13: టీఎన్టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండల్‌ను యూనియన్ నుంచి సస్పెండ్ చేసినట్లు యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ తెలిపారు. ఏడుకొండలు యూనియన్‌కు వ్యతిరేకంగా వాట్సాప్, పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని ఈ విషయం కేంద్ర కమిటీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో ఏడుకొండల్‌ను యూనియన్ నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఇక నుంచి యూనియన్‌తో అతనికి ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
OWN BUSINESS OFFER
★ 18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-All
SPOKEN ENGLISH
★ Speak English in 30 Days, M.S. Spoken English Classes - Easy way to Speak English, online/offline batches, Kaghaznagar. Cell: 9989693418.
NTK-317219
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అక